# పొరపాటు

కోమలాదేవి

ఏరోగ్రాం—ఉత్తరం చూడగానే డా. అమర్‌నాథ్‌కు చాల సంతోషం వేసింది. తమ్ముడు రాసిన ఉత్తరమది. అన్నింటికన్నా ముందర తెరిచి చదివాడు.

చాలా క్లుప్తంగా వ్రాసిన లేఖ అది.

"— ఢిల్లీలో మేజర్ కృష్ణారావు గారని ఉన్నారు. వారమ్మాయిని ఇస్తామంటున్నారు. ఆ అమ్మాయిని చూచి మీకు అంతా నచ్చితే మీరు వచ్చేటప్పుడు మీతో తీసికొని రావలసినది. పెండ్లి రిజిస్ట్రేషన్ ఇక్కడే కావాలి. కాబట్టి నేను అక్కడికి వచ్చి పెళ్ళాడి భార్యను తీసికొని రావటం కుదరదు.—అని మీకు తెలుసు. ఈ పరిస్థితుల్లో పెళ్ళి యిక్కడ జరగాలి—పిల్లను పంపాలి వారు—అమ్మాయికి కూడ ధైర్యం ఉండాలి. ఇవన్నీ చూసుకుని ఒక నిర్ధారణకు రావలసినది. అన్నయ్యా—నా అభిరుచులు, నా మనస్తత్వం, అన్నీ నీకు క్షుణ్ణంగా తెలుసు. ఆ అమ్మాయి నీకు నచ్చితే వెంటనే అన్ని ఏర్పాట్లు చెయ్యి— లేదా నచ్చలేదని నాకు తిరుగు టపాలో జాబు రాసెయ్యి......"

మిగతా వివరాలతో ముగించాడా ఉత్తరం. తమ్ముడు అరవిందనాథ్ అమెరికాలో ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ చేస్తున్నాడు. వెళ్ళి రెండు సంవత్సరాలైంది. అక్కడే ఉండిపోవాలని కోర్కె.— నెల క్రితం పేపర్లో వేయించిన ప్రకటన తాలూకు ఉత్తరాలల్లో ఇదే మంచిదిగా తోచింది అరవింద్‌కు. దాదాపు పదిమంది రాశారు. వారితో మేజర్ కృష్ణగారి అమ్మాయి బాగా చదువుకున్న పిల్ల. కొన్ని సంవత్సరాలు విదేశాల్లో ఉండి వచ్చారట అందుకని ఆ అమ్మాయికి పై దేశంలో పెళ్ళాడి కాపురం చేయటం మరీ క్రొత్తగా అనిపించదు!

ఎం. ఏ. ఇంగ్లీషు ప్రెసిడెన్సీ కాలేజీ నించి పాసయింది. అంటే మరీ చిన్నపిల్ల కాదన్నమాట. ఆమె వ్యక్తిత్వం పరిపూర్ణత చెంది ఉండాలి. విదేశ జీవితానికి అలవాటు పడగల మనః ప్రవృత్తి కల్గి ఉంటుంది. అమర్ చాలసేపు ఆలోచిస్తూ కూచున్నాడు.

ఇదిగాని నెరవేరితే—తన బాధ్యతలన్నీ పూర్తిగ నెరవేరినట్లే. అలా కళ్ళు మూసుకుంటే గతం వర్తమానంలోకి వచ్చింది. పూర్వ స్మృతులు అలలు అలలుగా తరుముకొస్తున్నాయి.

తను అందరికన్నా పెద్దవాడు. తరువాత ఇద్దరు చెల్లెండ్రు, ఒక తమ్ముడు. తండ్రి స్కూల్లో మేష్టరుగ పనిచేసేవారు పెద్ద ఆస్తిపరులు గాకపోయినా ఒకరిని ఆశించకుండా గౌరవంగా గుట్టుగా బ్రతుకుతున్న కుటుంబమది. తను చాల తెలివిగలవాడు. అన్నింటిలో ఫస్టుమార్కులొచ్చేవి. ఇంటర్ పరీక్షలో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చాడు. ఎం. బి. బి. ఎస్.లో ఇట్టే సీటు వచ్చింది. ఎలాగో పోలాగ తండ్రి తనకు డబ్బు పంపుతుంటే ప్రతి సంవత్సరం విధిగా పాసవుతూ ఆరు సంవత్సరాలకి డాక్టర్ పట్టా అందుకున్నాడు.

అంతే. ఇంటికి రాగానే సంసార బాధ్యతని కొడుకుచేతి కప్పగించి ప్రాణం వదిలాడు తండ్రి.

ఆ వూళ్ళో పెద్ద డాక్టర్లు లేరు, వెంటనే ప్రాక్టీసు పెట్టాడు. తనకు మిగతా వాళ్ళకు చాల సంవత్సరాలు తేడాఉంది. చెల్లెండ్రిద్దరు హైస్కూలు క్లాసుల్లో, చిన్నతమ్ముడు థర్డ్ ఫార్మ్‌లో ఉండేవారు.

అమర్ మితభాషి. మానవత్వం, ఇతడు తోబుట్టువులా అనిపించేటంత సాధు స్వభావం—రోగుల ఎడల జాలి, ప్రేమ—పెద్దల యెడల వినయ విధేయతలు కల్గిఉంటం మూలాన ఆ వూళ్ళో ప్రతి ఒక్కరికీ అతను ఆప్తుడయ్యాడు.

అతని మంచితనం—స్నేహం అతిగా గౌరవించి సాయపడినవాడు గోపాల్ ఇద్దరు కాలేజిలో బాలస్నేహితులు. కట్నం లేకుండా స్నేహితుని పెద్ద చెల్లి ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్ష రాయగానే పెళ్ళి చేసుకొని తీసుకెళ్ళిపోయాడు.

రెండో చెల్లి పెళ్ళి, అంత సులభంగా అవ్వలేదు. ఆమెను బి. ఏ. వరకు చదివించాడు. కొంత అప్పుచేసి కట్నాలు, లాంఛనాలు, మర్యాదలు జరుపవలసి వచ్చింది.

అప్పుదీర్చి కాస్త వూపిరి సలుపుకుందాం అనుకునేలోపల తమ్ముడు అరవింద్‌ను ఇంజనీరింగ్‌కు పంపవలసి వచ్చింది. తన ప్రాక్టీసు వేంకు వేలు తేకపోయినా ఈ బాధ్యతలకి ముందూ వెనకా ఆలోచించి నెరవ్వలసిన పరిస్థితులు కల్పించవంత సంపాదన ఉండేది

కాలచక్రం అవిరామంగా తిరుగుతోంది.

అరవింద్ ఫస్టున ప్యాసయ్యాడు. అంతే—వెంటనే కెమికల్ ఇంజనీరింగ్‌లో పై చదువులు చదివి డాక్టరేట్‌కు గాను స్కాలర్‌షిప్ రాగా అమెరికా వెళ్ళాడు.

అమర్‌కు ఇప్పుడు ముప్పైఐదో ఏడు. ఇంతవరకు తన పెళ్ళి విషయం తలపెట్టినవాళ్ళు లేకపోలేదు. తను గూడ ఆలోచించేవాడు. కానీ—ఎందుకో—వివాహం పట్ల పెద్ద విముఖత లేకపోయినా పెళ్ళి తన ధర్మాన్ని విస్మరించేలా చేస్తుందేమో అని భయం. అందరికి దూరమవుతాడేమో !

పెద్ద చెల్లి విషయం తనకు ఏ చీకూ చింతా లేదు. గోపాల్ తను, బంధుత్వంతో కలిసిన స్నేహబంధం గాఢమైంది. ఒకరిపై ఒకరి కెనలేని గౌరవం, ప్రేమ. కానీ రెండో చెల్లి సంసారం ప్రథమం నుంచీ ఒడుదుడుకులతో మొదలైంది. కోడరికం భరింపరానిదై పోయింది. ఆమె సంతోష

మిఖారి కోసం అమర్ ఎంతో ధనం వ్యయం చేయవలసి వచ్చింది. లాభం ఇసుమంతైనా లేకపోయింది. పీటీలో ఉమ్మడి సంసారం. లెక్చరర్‌గా నరిది తెచ్చే జీతం అందరికీ చాలదు. ఎప్పుడూ ఏవో గొడవలు. ఏవో విధాలుగా వేరే పెట్టించాలని చూచేడు చెల్లి ఆరోగ్యం చెడితే చివరికి ఇంటికి తెచ్చేశాడు. ఇద్దరు కొడుకు లామెకు. ఆరు నెలలకు ఆరోగ్యము పొందాక వచ్చి తీసుకెళ్లమంటే ఎవ్వరూ రాలేదు. అక్కడి పరిస్థితులను చూడటాని కెళ్లిన అమర్ బావమర్దిని తీసుకొచ్చేశాడు. అతని ఆరోగ్యం సరిలేదు. టి. బి. అని అనుమానమట. ఆ అనుమానం నిజమే అయింది. అప్పటికే ఆలస్యమైనట్లు అతను కొన్నాళ్లకే ఈ లోకం నుంచి నిష్క్రమించాడు. అప్పటినుంచి వాళ్ల భారం తనమీద పడింది.

పరిస్థితులు సానుకూలం కావటంలేదని గోపాల్ తన ప్రాక్టీస్ పెరగటంతో అమర్‌ను ఒప్పించి తీసికొని వెళ్లాడు మద్రాస్‌లో గోపాల్, తండ్రితో, అమర్ వార్డ్‌తో నర్సింగ్‌హోం నడిపేవాడు ఆర్థికంగా అమర్ బాగుపడ్డాడు. తల్లి, చెల్లి ఇంటిపనులు చూచుకుంటుంటే, పిల్లలు బళ్లోకి వెళ్తుంటే వాళ్లని చూస్తూ చాల తృప్తి చెందేవాడు. అతన్ని గూర్చి ఎన్నో కథలు చెప్పుకునేవారు పెళ్లాడమని తల్లి పోరుపెట్టని రోజు లేదు. అతను మాత్రం దురాలోచనతో కొంచెం లొంగినట్లే లొంగి వెంటనే విముఖత చూపేవాడు. అతనికి కాలేజీలో ఒకమ్మాయి పరిచయమైనట్లు, ఆమె మోసం చేసినట్లు, దాంతో విరక్తి చెంది పెళ్ళంటే అయిష్టమున్నట్లు చెప్పుకునేవాడు చనువుగా తిరిగే స్నేహితులు నిలదీసి అడిగితే నవ్వి వూరుకునేవాడు. ఏదెలా అనుకున్నా తనకే నష్టంలేదు. నమ్మితే మరీ మంచిది, పెళ్లి ప్రయత్నాలు చేయకుండా ఉంటారు. నిజం ఇదని ఖచ్చితంగా ఔనూ అనలేదు—కాదనీ అనలేదు. కాబట్టి తేలిందేమిటంటే అతని జీవితంలో స్త్రీ వల్ల కొంత మానసికబాధఅనుభవించాడని.

మంచి రోజులు చూస్తున్నాడు. తమ్ముడి పెళ్లి చేసేస్తే ఇక తనకే భారం వుండదు. అతని చదువు పూర్తయ్యే సరికి నాలుగైదు సంవత్సరాలు పట్టొచ్చు. తను కళ్లను గూర్చి ఎక్కువ ట్రైనింగ్ పొందటానికి అమెరికా వెళ్తున్నాడు ఇంకో నెల రోజులుంది. ఈలోగా ఎవరికో కుదుర్చుకుని తీసుకొని వెళ్లాలి.

అమర్ మద్రాసులో అంతా సిద్ధం చేసుకున్నాడు. ఒకనాడు ఢిల్లీకి ప్రయాణమై వెళ్లాడు మేజర్ కృష్ణస్వయ



ముగా కారు తెచ్చారు ఎంతో ఆదరంగా ఆహ్వానించారు ఇంట్లో.

స్నానం, టిఫిన్ అయ్యాక అమర్, కృష్ణగారు చాలసేపు ముచ్చటించుకున్నారు దాదాపు పది గంటలకు అమ్మాయి శాంతిని పిల్చారు. ఆమె పొడవుగా, అందముగా ఉంది. ఎంతో నిండుగా హుందాగ కనిపించింది. ఆ కళ్లలోని కాంతి, చేతల్లోని శాంతం చూడగానే తనకు తగిన మరదలనే నిర్ణయాన్ని కొచ్చేశాడు. ఆమె అలా సోఫాలో కూచుని స్వెట్టర్ అల్లుతోంది. అప్పుడప్పుడు మాత్రం తలెత్తి ఇద్దరికేసి చూచి తిరిగి తన పనిలో నిమగ్నమైపోయేది.

అమర్ తమను గూర్చి అంతా వివరంగా చెప్పాడు. చెప్పటంలో తను చాల త్యాగం చేసినట్లు, తండ్రి మరణానంతరం తను ఎంతగా అందర్నీ పైకి తెచ్చింది, చెల్లి విషయంలో ఎంత శ్రమపడిందీ చెప్పాడే గాని—అది ఎంతో సాధారణ విషయమైనట్లు అహం లేకుండా తన విషయం గొప్పగా చెప్పుకోలేదు అమ్మాయి తల్లి దండ్రులకివన్నీ అవసరమైన విషయాలే—వారు తెలుసుకోవలసినదే—ఆ భావంతోనే అతడు అన్నీ సమగ్రంగా చెప్పినట్లే ముఖ్య విషయాలన్నీ విశదీకరించేడు అతడు ఏకధాటిగా చెప్పుకు పోతుంటే కృష్ణగారు ఏమీ ఆటంకపర్చలేదు

ఆమె మాత్రం చాల శ్రద్ధగా వింటూ కూచుంది.

అప్పుడప్పుడు ఆమెను పరీక్షగా చూడటానికి కష్టంగా తోచిందతడికి. తమ్ముడి ఫొటోలు టీపాయ్ మీద ఉంచాడు.

**కుట్టుపని నేర్వండి**



గురువు లేకుండా అన్నిరకములను స్వయంగా కత్తిరించి కుట్టుటకు 384 పేజీల 400 బొమ్మల పుస్తకం రు.8/—బట్ట యేమీవృథా పోకుండా కత్తిరించుటకు 352 పేజీల 2 వేల బొమ్మల 160 ప్లాన్సు పుస్తకం రు 10/— 2 తెలుగు వి పి.అదనం బి.పున్నారావుచౌదరి, ఆముదాలపల్లిపోస్టు, (వయా) బంటుమిల్లి, బందరు తాలూకా





అన్నివేళలయందు అందరూ వాడతగినవి
ఎంబ్రోసియా
వారి
ద్రాక్షరసం... నిమ్మరసం
అనాసరసం... మామిడిపళ్ళరసం
నారింజపళ్ళరసం.
సిరప్‌లు
ద్రాక్ష... ఆరంజ్... రోజ్...
అనాసు... రాస్ బెర్రీ...
సరస్‌పరిల్లా (సుగంధి)
ఎంబ్రోసియా
క్యానింగ్ ఎంటర్‌ప్రైసెస్,
పోస్టుబాక్స్ నెం.545, విజయవాడ



ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో మహిళలు ఆధారపడునది



లోధ్ర
ఆరోగ్య సౌభాగ్యములకు
65 సంవత్సరముల పైగా ప్రసిద్ధి నొందినది
కేసరి కుటీరం
(ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)


## పొరపాటు

"ఇది ఎస్. ఎస్. ఎల్. సి. లో ఉండగా తీసిన ఫోటో, ఇది ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్‌లోది ఇది మూడో సంవత్సరంది. ఇది పాస్‌పోర్ట్‌కని తీసింది ఇది మొన్నటిది లేటెస్ట్. చూచీ చూడనట్లు చూస్తోంది. ఆ ఫోటో లుంచిన టీపాయ్ ఆమెకు దగ్గరగా జరిపాడు ఆమె కేవిధంగా యిబ్బందీ కల్గించకూడదన్న ఉద్దేశంతో కృష్ణగార్ని మాటల్లోకి దింపాడు

ఆ సాయంత్రం అతను ఒంటరిగా తోటలో కూచుని ఉన్నాడు. శాంతి వచ్చి దూరంగా కుర్చీలో కూచుంది.

"ఏ సబ్జక్టులో ఎం. ఏ. చేరారు ?" మాటిగా చూస్తూ అడిగాడు.

"ఇంగ్లీషు"

"ఐతే మీరు ఫారిన్‌లో పి హెచ్‌డి చేయొచ్చు ఏమంటారు"

ఆమె మౌనం దాల్చింది. చాలసేపు ఆమె జవాబుకోసం నిరీక్షించాడు. లాభం లేకపోయింది.

అతను ఆత్రంగా కాస్త ముందుకు వంగాడు.

"చాల దీరంగా ఆలోచిస్తున్నారు మీకు మీకు వెళ్లటానికిష్టంలేదా ! దాపరికం లేకుండా చెప్పండి .... నా తమ్ముడు సుఖించాలని తాపత్రయపడటం వాస్తవం—కానీ, మీ కిష్టంలేకుండా, మీ తలిదండ్రుల ఇష్టంకొద్దీ బలవంతంగా మీరు వెళ్ల నవసరంలేదు. మీ కయిష్టంగా ఉంటే చెప్పండి—నేనే ఏదో చెప్పి వెళ్లిపోతాను...... "

ఆమె కళ్ళు వాల్చేసుకుంది. సుదీర్ఘంగా నిట్టూర్చి మెల్లగా అంది. "అవేం లేదు.. వెళ్లటానికి నాకే సంశయంలేదు . మీకన్నీ తెలుసు. ఇది కేవలం పుట్టింటిపై గల మమకారమే"

అతను హాయిగా నిశ్వసించి వెనక్కి ఆనుకున్నాడు.

"అక్కడికెళ్తే మీకు చాలా బాధ్యత లుంటాయి......"

ఏమి టన్నట్టు చూచింది.

"నా తమ్ముడు చిన్నవాడు—అంటే కష్టాలకు, బాధలకు, సమస్యలకు అతీతుడిగా పెరిగాడు. ఒకవిధమైన సరళ మార్గంలో పెరిగి పెద్దవాడయాడు. ఎప్పుడు డబ్బుకు లోటు లేకపోయినా—ఎక్కువ డబ్బు మనిషి కిచ్చే దురలవాట్లు అలవడనంతవరకు ఎంత డబ్బు అవసరమో అంతే ఉండేది. క్లిష్ట పరిస్థితుల నెదుర్కోగల ధైర్యం ఉందో లేదో చెప్పలేను. తెలివి ఉండొచ్చు, తగిన గుణగణాలుండొచ్చు కానీ సమీక్షా కారిత్వం ఉన్నదో లేదో తెలియదు మీ ఇద్దరు చిన్నవాళ్లు కాబట్టి ఎంతో ఓర్పు అవసరం. ఒకరినొకరు అర్థం చేసుకోక ముందే మీరు భార్యాభర్తలై పోతారు. అంతవరకు వెళ్లి తిరిగి రావటంలో ఎంతో అనర్థం ఉంది. అందుకని మీరు బాగా ఆలోచించాలి చాలా ధైర్యంతో దీనికి ఒప్పుకోవాలి. నా తమ్ముడు నాకు అత్యంత ప్రియుడు. అన్నీ మంచి గుణాలే అగుపిస్తాయి నాకు అతన్ని గూర్చి చెప్పవలసినదంతా చెప్పాను ఇక మీరే ఒక నిర్ణయానికి రావాలి." అతను ఆమెవైపు ఉత్సుకతతో చూస్తుండిపోయాడు

కొన్ని క్షణాలు గడిచాయి. తన సుకుమారమైన వ్రేళ్లకు గడ్డిపోచలు చుట్టుకుంటూ కూచుందామె. మెల్లగా తన విశాల వినీల నయనాల నెత్తి అతడి కళ్లలోకి చూచి తన నిశ్చయాన్ని తెలియజేసింది.

"అలాగే కానివ్వండి చాల రోజుల నించి ఆలోచిస్తున్నాను ఎడ్వెంచరస్‌గా ఉండకపోతే జీవితం వ్యర్థమనిపిస్తుంది. నాకు వెళ్లటానికే అభ్యంతరంలేదు ... కానీ మీ తమ్ముడుగార్ని గురించి ఎన్నో విషయాలు తెలిసికోవాలనుంది. మీరు వారి జీవితాన్ని చెబితే సావధానంగా వింటాను. ఎటువంటి వ్యక్తో ఒక నిర్ణయాని కొస్తాను."

అతని ముఖం ఆనందంతో విప్పారింది. ఆమెకేసి నిశ్చలంగా చూచాడు ఆమె చాల అందంగా కనిపించింది. ఆమె తెలివితేటలకి ఇంకా ఆనందించాడు.

తన తమ్ముడి జీవిత విశేషాల్ని, ఉత్ప్రేక్షించకుండా మామూలుగా చెప్పుకుపోయాడు. ఆమె కథ విన్నట్లు దీక్షగా వింటూ కూచుంది.

అతను ఢిల్లీకి రావటం అదే ప్రథమం. మేజర్ కృష్ణగారు కారును, డ్రైవర్‌ను అతని ఆధిపత్యంలో ఉంచారు. అతను రెండు రోజులు అన్నీ చూచాడు. ఒక రోజు ఆగ్రా వెళ్లి వచ్చాడు.

ఆఖరిరోజు కుతుబ్‌మినార్ చూడటానికి అమర్‌తోపాటు అందరూ పిక్‌నిక్‌లా బయలుదేరారు.

కారు నిండుగ కూచున్నారు.

సాయంత్రం నాల్గు గంటల వేళ.

అక్కడి తోటంతా రకరకాల పువ్వులతో శోభిల్లుతుంది. గడ్డిమీద కూచున్నారంతా శాంతి తమ్ముళ్లిద్దరూ, కొంత వరకు కుతుబ్‌ను ఎక్కి వచ్చారు.

ఆకాశానికి నిచ్చెనలా ఉన్న ఆ మినారుని చూస్తూ చైతన్యరహితంగా నుంచుండిపోయాడతను. ఏవో అక్షరాలు—ఉర్దూనో— అరబ్బీనో— ఏదోతనకు తెలియదు!

శాంతి అతని దగ్గరగా వచ్చి నుంచుంది.

"ఇంత దగ్గరగా చూస్తే మెడలు పట్టుకు పోతున్నాయి."

"ఏమాలోచిస్తున్నారు?" శాంతి తలెత్తి ఆ కట్టడాన్ని చూస్తోంది

"ఏముంది ఆలోచించటానికి? ఎంత అందంగా, హుందాగా ఉంది! ఈ బయలు ప్రదేశంలో ఒంటరిగా, శతాబ్దాలుగా నిలబడి ఒకనాటి మానవుని అఖండశక్తిని అంతస్తులుగా చాటుతుంది!"

ఆమె దృష్టి మరల్చింది తమ్ముళ్లు పిలవటాని కొచ్చారు. ఆమె—అతడు అడుగు తీస్తున్నారు. "ఈ కట్టడం కుతుబ్‌చే కట్టబడినది కాదని, రాజపుత్రులచే కట్టబడిన దానిని ముస్లింలు కొద్దిగా మార్చి కట్టారనీ, ఈ అక్షరాలన్నీ పీరు వ్రాయించినవనీ చెబుతారు ....."

"ఔను. చదివాను. రెడ్‌ఫోర్ట్ కూడ షాజహాన్ నిర్మితం కాదనటం—ఫతేపూర్ సిక్రీలు రాజపుత్రుల కేంద్ర స్థానాలంటూ పరిశోధించి వ్రాసిన వ్యాసాలు చదివాను గానీ .. . అవన్నీ ఒక ఎత్తు— కడకు తాజ్‌మహల్ కూడ మామూలు సమాధి అంటూ పేపర్లో చదవగానే ఎంతో ఇదినిపించింది సుమా!"

అంతలో వారు తల్లి తండ్రిని సమీపించారు ఏవో కబుర్లతో కాలక్షేపంజేసి ఇంటికి వెళ్లిపోయారు.

మరుసటిరోజు తిరిగి మెడ్రాసుకు వెళ్లకముందు అమర్ ఒక ఉంగరం, చీర, రవికె తెచ్చి ఇచ్చాడు.

"ఇంకో వారం పోయాక మీరు మీ అమ్మాయిని తీసికొని రావాలి. అమ్మా వాళ్లు చూస్తారు ఆ తర్వాత మీరు పాస్‌పోర్టు వీసాలకు ప్రయత్నాలు మొదలెట్టండి.

అనుకున్న విధంగా, శాంతి, తండ్రితోపాటు మెడ్రాస్ చేరింది గోపాల్, అమర్‌లు స్టేషన్ కొచ్చారు.

వాళ్లు హొటల్‌లో ఉండటానికి నిశ్చయించుకున్నారు అమర్ ఎంతో నొచ్చుకున్నాడు కానీ తండ్రి ఏదో సర్ది చెప్పారు.

మేజర్ కృష్ణగారి ముఖం బాగా అలసి ఉంది ఏదో అవ్యక్తమైన బాధ, ఆందోళన వ్యక్తమవుతుంటే చూచినవాళ్లిద్దరికి అస్వభావికంగా తోచలేదు. కూతుర్ని ఇక ఒకరి చేతిలో పెట్టాలి ఇంతటితో ఋణం తీరినట్లే—ఏం లాభం——ఎంత చేసి—ఎంత ప్రాణం పెట్టినా ఒకరి చేతిలో పెట్టవలసినదే!

మంచి హొటల్‌లో వాళ్లను దింపి— అన్ని సదుపాయాలు కల్పించి వెళ్లిపోయారు. శాంతి హృదయం శాంతికి దూరమైపోయింది. సాయంత్రం ఐదు గంటలకి అమర్ వచ్చాడు. శాంతి అతిగా అలంకరించుకోలేదు. సాధారణంగానే అగుపించింది. లక్నో ఎంబ్రాయిడరీ చేసిన తెల్ల ఫుల్ వాయిల్ చీర—నల్లని 'ముఖమల్' రవికె వేసుకుంది ఒంటిపేట ముత్యాలు కంఠాన్ని అలంకరిస్తున్నాయి నయాపైసా అంత బొట్టు ఆమె కంటిపాప తళుకుతో వెలవెల బోతోంది పైగా ఎత్తి ముడి వేసిన వెంట్రుకల మీదుగా కొంగు కప్పుకుని బైటి కొచ్చింది.

పరస్పరాభినందనల తర్వాత అంది "నాన్నగారు అలా వెళ్లారు ఆరు గంటల కొస్తారుట. వాళ్ల ఫ్రెండ్ రిటైర్డ్ కల్నల్ అడయార్‌లో ఉన్నారుట వెళ్లారు."

ఆమె దూరంగా ఉన్న కుర్చీలో కూచుని ఎటో చూస్తోంది.

అమర్ వేచివుండాలన్నట్లు సోఫాలో చేరగిలబడ్డాడు. ఏదో స్ఫురించింది. గబుక్కున లేచి నుంచున్నాడు.

"మీరు మెడ్రాసుకు రావటం ప్రథమం కాదుగా—"

ఆమె మెల్లగా తలాడించి మందహాసం చేసింది. "ఇక్కడే చదివాను. .."



అతను నిరాశ చెందాడు. "ఐతే చూడవలసిందేమీ లేదు. మీ రిక్కడే చదివారన్న విషయం మర్చిపోయాను సుమా."

ఆమె లేచి నించుంది. "చూడవలసినవేమీ లేవు గానీ—ఢిల్లీలో సముద్రం లేదు చూచి చాల రోజులైంది డాక్టర్"

"ఓ కె ఐతే అక్కడికే వెళ్దాం ఓ అరగంటకంతా వచ్చేస్తామని చెప్పి వెళ్దాం"

టాక్సీ తీసుకున్నారు ఆమె ఒంటరిగా వెనుకవైపు కూచుంది. బీచ్ దగ్గర దిగారు అప్పటికే బీచ్ నిండుగ జనం. ఆమె ముఖంలో చికాకు స్పష్టమైంది.

"నా కేదో గాభరాగా ఉంది . అలా మెరీనా కేంటీన్‌లోకి వెళ్దాం. పోనీ ఆ ప్రక్క ఎక్కువమంది లేరు. అలా ప్రశాంతంగా కాసేపు కూచుంటే ప్రాణానికి హాయనిపిస్తుంది డాక్టర్‌గారు"

అతను మౌనంగా ముందు నడుస్తున్నాడు చాల దూరం నడిచారు అక్కడ రద్దీ తక్కువగా ఉంది. ఇద్దరు ప్రక్క ప్రక్కగా కాస్త దూరంగా కూచున్నారు.

ఎవ్వరూ ఏమీ మాట్లాడటంలేదు. ఆమె తదేకంగా పాలపొంగులాంటి నురగలు గ్రక్కుతున్న అలలకేసి చూస్తోంది. అతనే మాట్లాడాడు. "నాకు అశాంతిగా ఉంటే ఎలియట్స్ బీచికి వెళ్లి ఇలా ఒంటరిగా కూచుంటే అంతా పటాపంచలై మనసు నిర్మల మవుతుంది .."

ఆమె ఏదైనా మాట్లాడుతుం దనుకున్నాడు గానీ శాంతి ఇటు తిరిగి చూడనైనా చూడలేదు.

"చాల దీర్ఘంగా ఆలోచిస్తున్నారు .... ఆమెకేసి చూస్తూ అన్నాడు

ఆమె చటుక్కున అతనివైపు చూచింది. వాచీవేపు చూచుకుని ఒక్క నిట్టూర్పు వదలింది.

"ఔను ... ఎప్పుడూ .. ఇలాగే ఇక్కడ కూచోవాలనిపిస్తుంది"

"నిజమే . . ఈ అనంత జలరాశిని చూస్తూంటే ఏదో సన్నిహితత్వం ఏర్పడుతుంది ...."

ఆమె నెమ్మదిగా తల త్రిప్పింది తల మీది ముడి మీదనించి కొంగు కొద్దిగ



జారింది అతి నెమ్మదిగా, ఉద్రేకంతో అంది "అది కాదు డాక్టర్‌గారూ . ఇలాగే ఇక్కడే మీ సాన్నిధ్యంలో కూచోవాలనిపిస్తోంది"

"శాంతీ— ఏమిటి మీరంటున్నది" అమర్ ఉద్రేకంతో బిగ్గరగా గబగబ అనేశాడు.

ఆమె రెండు చేతుల్లో ముఖం దాచుకుంది. బాణం సంధించి వదలింది. ఇక దాని సంగతి తనకు తెలీదు హృదయం అతి వేగంగా కొట్టుకుంటోంది మాటలు అన్నదే గాని, మరి మాటాడేందుకు ధైర్యం చాలటంలేదు.

"శాంతీ—మిమ్మల్ని నా తమ్ముడికోసం ఏర్పాటుచేసి మాటలు జరిపామని ముందునించీ స్పష్టంగా మీకు తెలుసునుకదా—ఇలాంటి పొరపాటు .... పొరపాటు ." అతను తల పట్టుకుని కూచున్నాడు.

ఇదే సమయం—మాట్లాడాలి—హృదయము విప్పి చెప్పుకోవాలి. "పొరపాటు కాదు డాక్టర్‌గారూ ... మిమ్మల్ని చూచిన మరుక్షణంనించీ నాకు తెలియకుండానే మిమ్మల్ని ప్రేమించాను...."

"శాంతీ—చూడమ్మా—నువ్వు చిన్న. ." మధ్యలోనే ఖండించింది.

"నన్ను అమ్మా అనకండి ఈ క్షణంలో ఇలా మనసు విప్పి మాట్లాడగల్గుతున్నానంటే అది ఇన్నాళ్ళుగా నేను పడిన ఆవేదన ఫలితమే మీరు అర్థం చేసుకోండి...... ఈక్షణంలోనే ఏమాటా చెప్పండి. మీచే తిరస్కరింపబడితే వెంటనే వెళ్లిపోతాను. ఏ సందర్భంలో కూడా నేను మీ తమ్ముడికి భార్యను కాలేను."

అమర్ స్థాణువై రెప్ప వాల్చకుండా చూస్తుండిపోయాడు తల పంకించి ఉద్రిక్తుడయ్యాడు "మీతండ్రిగార్కి, నాతమ్ముడికేం చెప్పను శాంతీ!—నా మాటలపై లక్ష్యముంచి నిన్ను తీసుకొచ్చారు. అక్కడ అరవింద్ ఎదురు చూస్తుంటాడు. ఇలాంటి పరిస్థితుల్లో నిన్ను నేను స్వీకరించటం న్యాయమంటావా ?" శాంతి ఇసుక ప్రోవు చేస్తూ—గోపురాల్ని పడగొడ్తోంది.

"నాన్నగార్కి రైల్లో చెప్పాను . చాలాసేపు వాదించుకున్నాము. ఇది ఎలా పరిణమిస్తుందో అని నాన్న ఎంతో ఆందోళన చెందుతున్నారు .. నా హృదయం విప్పి చెప్పాను. ఆ తర్వాత మీయిష్టం !" ఆమె సజల విశాల నయనాలను వాల్చేసుకుంది అమర్ ఇరకాటంలో పడిపోయాడు.

ఏదో ఒక విధంగా తప్పుకోవాలి "నాకు ముప్పైఆరు సంవత్సరాలు. నీకన్నా ఎంత పెద్దవాడినో చూడు శాంతీ— నా యవ్వన కాలం గతించి పోయింది ఏది చేసినా పెద్దవారి తరహాగ చేస్తాను. నాకు సరదాలు, సల్లాపాలు ఏమీ లేవు నాతో ఏం సుఖపడ్తావ్—ఏ సందర్భంలో కూడ నా తల్లిని, చెల్లిని, పిల్లల్ని వేరు చేయలేను. అరవింద్ అన్నింటికి తగినవాడు చిన్నవాడు. దాంపత్య జీవితంలో పొందవలసిన ఆనందము అతని సాహచర్యంతో లభించగలదు . .... నీ విషయం రాశాను ఎంతగానో ఎదురు చూస్తుండవచ్చు నన్ను నమ్ముకుని నా విచక్షణపై ఆధారపడిఉంటే చటుక్కున అంతా తారుమారు చెయ్యాలేను .. నాకు చేతకాదు .. ఇలా జరిగిందని రాయలేను ...."

అమర్‌నాథ్ ఆమెవైపు ప్రాధేయపడుతున్నలా చూచాడు.

శాంతి కళ్లలో నీళ్లు తిరుగుతున్నై. చుట్టూ కొద్దిగ దూరంలో కూచున్న మనుష్యులు—భార్యాభర్తల పోట్లాటలో, తిరిగి కలవటమో—ఏమో అవి ఆసక్తిగా చూచీ చూడనట్లున్నారు

శాంతి కాళ్లు వత్తుకుంది హేండ్ బేగ్ తెరచి ఏరోగ్రామ్ ఉత్తరం అతడికందిస్తూ "చదవండి" అంది.

ఆమె లేచి వెళ్లి అలలు పరుచుకొని వస్తున్న తీరానికి వెళ్లి కూచుంది. ఆమె చీర కుచ్చిళ్లు నీళ్లలో తడుస్తున్నాయి. ఒక్కొక్క అల ఇంకాస్త పైకి వస్తుంటే ఆమె వెనక్కి జరిగి కూచుంది పాల నురుగులాంటి చీరను చూడలేక అన్నట్లు అలలపై నురుగు ఆమెను సమీపించక ముందే మాయమవుతున్నాయి. ఆమె నిశ్చ

లంగా కూచుని ఉంది.

అమర్ ఆతృతతో ఉత్తరం తెరిచాడు. చూడగానే విస్తుపోయాడు.

అరవింద్—వదినా—అని సంబోధిస్తూ శాంతికి రాసిన లేఖ అతని ఆలోచనలు స్తంభించినై. అచంచలుడై పోయాడు. చాల చిన్న లేఖ.

"మీ లేఖను చూచి కొంతవరకు ఆశ్చర్యపడినమాట వాస్తవం మీచే అన్నయ్య ఆకర్షింపబడ్డారని తెలిసి నా కెంతో సంతోషము వేసింది అన్నయ్య ఒక ఇంటివాడు కావాలని మేమంతా ఎన్నాళ్లగానో ఎదురు చూస్తున్నాము పెద్దలు లాభంలేదని వూరుకున్నారు మీ ప్రయత్నం సఫలం కావాలని—అన్నయ్య మిమ్మల్ని తప్పక తన అర్ధాంగిగా స్వీకరించవలెనని సర్వదా భగవంతుని ప్రార్థిస్తున్నాను.

అన్నయ్య చాలా మంచివాడు మిమ్మల్ని అర్థం చేసుకోగలడు.

భారతదేశం గొడ్డుపోలేదు నాకు తగిన అమ్మాయి ఎక్కడో ఉండకపోదు. ఈ విషయంలో నిశ్చింతగా ఉండండి కానీ వధువు అన్వేషణ మాత్రం మానకండి.

నాకు అతి త్వరలో ఏ కబురు తెలుపగలరు "

అతని చేతిలో కాగితం చల్లగాలికి రెపరెప లాడుతుంది

ఒక్కసారి కాదు—పదిసార్లు చదువుకున్నాడా లేఖ.

అతని హృదయంలోని అల్లకల్లోలాన్ని, సంశయాన్ని, బాధను, ఆవేదనను, కప్పి వేస్తున్నలా సముద్రం ఘోషిస్తూనే ఉంది .

ఆమె అతనికి వ్యవధి యిస్తున్నలా మవునం దాల్చింది

నిమిషాలు దొర్లిపోతున్నాయి

శాంతి వెనుదిరిగి చూచింది.

ఇంతటితో తన భవిష్యత్తు ఒక రూపాని కొస్తుంది ఏదో ఒకటి తేలిపోతుంది అంతటితో సరి !

అమర్ కాళ్లను చుట్టేసుకుని సముద్రం కేసి చూస్తున్నాడు.

"ఇక వెళ్దామా ? వాన్న ఎదురు చూస్తుంటారు " నిలబడే అడిగింది.

"శాంతి . ఇలా కూచో ...."

ఆమె కొద్ది దూరంలో కూచుంది.

"నాలో ఏం చూచి ప్రేమించావు శాంతీ ... .ఎటూ తేల్చుకోలేక పోతున్నాను సుమా!" జాలి గొల్పుతున్న చూపులతో ఆమె నరి కట్టాడు.

"పరిపూర్ణ మానవత్వానికి, వ్యక్తిత్వానికి ఒక అర్థం కల్పించిన మీరు నా హృదయంలో చిరస్థాయిగా నిల్చి పోయారు .... "

అమె ముఖం ప్రక్కకు త్రిప్పుకుంది ఆ సంధ్య చీకట్లలో ఆమె ముఖ కవళికలు స్పష్టం కాలేదు కాని స్వరం—లీలామాత్రంగా కంపించింది . "మీరు ....నా కోసం ఏ త్యాగం చేయ నవసరంలేదు డాక్టరుగారూ మనస్ఫూర్తిగా మీ కిష్టమైతేనే ఈ వివాహం జరుగుతుంది "

ఆమె లేచి నిలబడింది కొంగు నిండుగా కప్పుకుని,

"వెడదామా" అంది.

అమర్ నుంచున్నాడు. ఇద్దరు మెల్లగా నడుస్తూ రోడ్డెక్కారు

టాక్సీ వచ్చి ఆగింది ఆమె ఎక్కి కూచుంది అమర్ తలుపు చేతిలో పట్టుకుని ఈ క్షణమాత్రంగా తటపటాయించాడు ఆ ఒక్క క్షణం శాంతికి వెయ్యి యుగాలుగా అనిపించింది గుండె కొట్టుకోవటం ఆగిపోయినట్లే బాధపడింది .. కానీ అమర్ తలుపు బార్లగా తెరిచి ఎక్కి కూచున్నాడు

శాంతి కళ్లు మూసుకుని వెనక్కు చేరబడి దీర్ఘంగా, హాయిగా నిశ్వసించింది. ఆమె హస్తాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు

"శాంతీ—" అని మృదువుగా పిల్చాడు

నక్షత్రాల్లా మెరుస్తున్న కన్నీళ్లతో అతనివేపు చూచింది

"నువ్వే గెల్చావు శాంతి . "

"ఇక ఎప్పటికీ మీరే గెలుస్తారుగా" అంది ఆవేశంతో.

"ఎన్నో విషయాలు ఆలోచించాలి...."

"ఎంతకాలం కావాలి?"

"బహు కొద్ది కాలమే . నిస్సహాయుడినై పోయాను త్వరగా పాయానికి రావాలి ."

టాక్సీ వేగంగా పోతూంది—చల్లగాలి, విద్యుద్దీపాల వరుసలు—ప్రక్కలో ప్రేయసి —అతని చేతిలో ఆమె చెయ్యి—ఆ క్షణం విలువలేనిది

అతని హృదయం ప్రశాంతమైంది.

